క్లుప్తంగా

బీజేపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి


మాట్లాడుతున్న బాలకృష్ణ

బెజ్జూర్: లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మర బాలకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం బీజేపీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బిక్షపతి, నాయకులు దిగంబర్, తిరుపతి గౌడ్, వసీ ఉల్లఖాన్, రాకేశ్, మోహన్ తదితరులు ఉన్నారు.

'ఆర్థికంగా లాభపడండి'


ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: టీఏలు, ఎఫ్ఏలు తెలిపిన పని వేళల్లో అధిక పనులు చేసి ఆర్థికంగా లాభపడాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. మంగళవారం మండలంలోని సాంగ్వి గ్రామ పంచాయతీలో జరిగిన ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలు ఎందరు పని చేస్తున్నారు.. కొలతలు ఎలా తీసుకుంటున్నారు.. హాజరు ఎలా వేస్తున్నారు.. వంటి అంశాలను పరిశీలించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం11 గంటల వరకు పనులు ముగించాలన్నారు. అనంతరం పెద్ద సాకడ గ్రామస్తులతో మాట్లాడారు. గిరి వికాస్ పథకం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ ఐక్యనాయక్, టీఏ, ఎఫ్ఏ, గ్రామ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

మహిళలు అభివృద్ధి సాధించాలి


మాట్లాడుతున్న శారద

కెరమెరి: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని మహిళా సాధికారిత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ బిజ్జూరి శారద అన్నారు. మంగళవారం మండలంలోని సుర్దాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మహిళలు 181 సఖీ, పిల్లల కోసం 1098, 100, 1930 వంటి హెల్ప్‌లైన్ నంబర్లపై వివరించారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ రాణి, రాజేశ్వరి, సాగర్, అంగన్‌వాడీ టీచర్ బొజ్జుబాయి, మహిళలు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి


వార్షికోత్సవంలో పాల్గొన్న మహిళలు

కెరమెరి: ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని పట్నాపూర్ ముఖ్య సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్ ఇంగ్లే అన్నారు. మంగళవారం మండలంలోని ఇంద్రానగర్‌లో శ్రీ సద్గురు పూలాజీ బాబా ధ్యాన మందిర 9వ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. నాయకులు నారాయణ, బాజీరావు హర్నె, గుణాజీ, సూర్యభాన్, ఉత్తం, గిరి, మారుతి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

కెరమెరి: మండలంలోని సుల్తాన్‌గూడలో కొనసాగుతున్న శ్రీ వేంకటేశ్వర స్వామి జాతరలో నేటి నుంచి రెండు రోజులు కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు దండుగుల ఎల్లప్ప, కోవ దేవ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ. 21 వేలు, రెండో బహుమతి రూ. 15వేలు, మూడో బహుమతి రూ.7777 అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎంట్రీ ఫీజు రూ. 500 ఉంటుందని పేర్కొన్నారు.

ఎల్లమ్మ రేణుకామాత ఆలయంలో పూజలు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఆర్ఆర్‌వో కాలనీలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో మంగళవారం వేదపండితులు దుద్దిళ్ల మనోహర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లమ్మ రేణుకామాత, నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా గణేశ పూజ, పుణ్యాహవాచనం, యజ్ఞశాల ప్రవేశం, తదితర పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, గౌడ సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అందని ద్రాక్షగా వైద్యం


బెజ్జూర్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం

- పేరుకే 30 పడకల ఆసుపత్రి
- వేధిస్తున్న వైద్య సిబ్బంది కొరత
- అరకొర వైద్యంతో రోగుల అవస్థలు
- పట్టించుకోని యంత్రాంగం

బెజ్జూర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలి.. ప్రసవాల సంఖ్య పెంచాలని పదేపదే అధికారులు చెబుతుంటారు. అన్ని రకాల వసతులు కల్పించామని ఇక్కడే సేవలు పొందాలని సూచిస్తుంటారు. తీరా ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్న రోగులకు సరైన సౌకర్యాలు లేకపోగా వైద్యులు కూడా అందుబాటులో ఉండటం లేదు. దీంతో అత్యవసరమైతే మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం మండలాల్లో పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నప్పటికీ వైద్యులను నియమించడంలో మాత్రం ఆసక్తి చూపడం లేదు. దీంతో జిల్లాలోని గిరిజనులకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగా మారింది.

సిబ్బంది లేక తిప్పలు

బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది లేక, వైద్యం అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతోపాటు వైద్య సిబ్బంది కొరత వేధిస్తోంది. రెండు సంవత్సరాల క్రితం పీహెచ్‌సీగా మార్చి 30 పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేసినా కేవలం ఒకే ఒక వైద్యుడు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పేరుకు మాత్రమే 30 పడకల ఆస్పత్రిగా బెజ్జూర్ వైద్యశాల మిగిలిపోతోంది. సిబ్బంది కొరతతో అత్యవసర సమయాల్లో రోగులు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాగజ్‌నగర్‌కు వైద్యం కోసం వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. 24 గంటలు సేవలందించాల్సిన ఆస్పత్రిలో రోగులతో పాటు వైద్యులకు సైతం ఇక్కట్లు తప్పడంలేదు. అత్యవసర సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. 30 పడకల ఆస్పత్రిగా వైద్య విధాన పరిషత్ గుర్తించిన నేటికీ సరైన సౌకర్యాలు కల్పించడం, అందుకు తగ్గట్టుగా వైద్యశాలలో పక్కా భవనాలను నిర్మించకపోవడంతో మండల ప్రజలకు వైద్యం అందని ద్రాక్షగానే మిగిలింది. బెజ్జూర్ పీహెచ్‌సీ పరిధిలో ఆరు సబ్ సెంటర్లు ఉండగా, ఇందులో ఏఎన్ఎంలు 12 మందికి గాను కేవలం ఎనిమిది మంది పనిచేస్తున్నారు. ఒక్క సబ్ సెంటర్‌లో హెల్త్ అసిస్టెంట్లు లేకపోవడం గమనార్హం. ఆరు సబ్ సెంటర్లలో కేవలం కర్జెల్లి, దిందా సబ్‌సెంటర్లకు మాత్రమే పక్కా భవనాలు ఉండగా, కుకుడ, బెజ్జూర్, ఉట్‌సారంగాపెల్లి, కుంటలమానెపల్లి సబ్‌సెంటర్లకు పక్కా భవనాలు లేక సక్రమంగా వైద్యం అందడం లేదు. అధికారులు స్పందించి మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


వైద్యుడు లేక ఖాళీగా ఉన్న కుర్చీ

రెగ్యులర్ వైద్యుడు లేడు..

బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ డాక్టర్ లేక తొమ్మిది నెలలు కావస్తుంది. వైద్యుడు లేకపోవడంతో స్టాఫ్ నర్స్, వర్కర్స్ కూడా వైద్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. 30 పడకల ఆస్పత్రి మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా రెగ్యులర్ వైద్యుడు మాత్రం నియమించడం లేదు.

రెగ్యులర్ వైద్యుడిని నియమించాలి



బెజ్జూర్ 30 పడకల ఆస్పత్రిలో రెగ్యులర్ వైద్యుడు లేకపోవడంతో ప్రజలకు సరైన వైద్యం అందడం లేదు. అలాగే సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వైద్య సిబ్బంది కొరత కారణంగా వైద్యం సైతం సక్రమంగా అందడం లేదు. వెంటనే రెగ్యులర్ వైద్యుడిని నియమించాలి.

– అన్నారం శ్రీనివాస్, బెజ్జూర్

అత్యవసర సమయంలో ఇతర ప్రాంతాలకు..



బెజ్జూర్ పీహెచ్‌సీలో వైద్యుడు లేకపోవడంతో అత్యవసర సమయంలో రోగులను కాగజ్‌నగర్, ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు తరలించాల్సి వస్తోంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి వైద్య పోస్టులను భర్తీ చేయాలి.

– పర్శా గణేశ్, బెజ్జూర్

రోడ్డు మరమ్మతులు నిలిపివేత


మొర్రిగూడ శివారులో తొలగించిన రోడ్డు

తిర్యాణి: మండలంలోని మొర్రిగూడ గ్రామం నుంచి చిన్న అరటిపెల్లి స్టేజి వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో గత నెల 27న సాక్షిలో 'గుంతల రోడ్లతో తిప్పలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ప్యాచ్ పనులు చేపట్టేందుకు దాదాపు రూ.8లక్షల అంచనా వ్యయంతో మంగళవారం పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా ముందుగా గుంతలు ఉన్న చోట డాంబర్‌ను తొలగించారు. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు తమ శాఖ పరిధిలోని రోడ్డుకు ప్యాచ్ పనులు చేపట్టేందుకు అనుమతులు లేవని పనులు నిలిపివేశారు. ఎలాంటి షరతులు విధించకుండా రోడ్డు మరమ్మతులకు అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వాలని మండల వాసులు కోరుతున్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

రెబ్బెన: ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారి సుజిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పని చేస్తున్న ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 3నెలల వేతనాలతో పాటు 7నెలల పీఆర్సీ ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని లేకుంటే ఈనెల 22 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. పెండింగ్ వేతనాల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన రేపుమాపు అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. ఎన్‌హెచ్‌ఎం స్కీంలో దాదాపు 78 క్యాడర్లలలో సుమారు 17,514 మంది ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో ఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో 2వ ఏఎన్‌ఎం యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రమీల, ఎన్‌హెచ్‌ఎం డాక్టర్లు సుప్రియ, సిబ్బంది విజయలక్ష్మి, రేణుక, ఝాన్సీ, సరిత, మండల్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి తడిసిన మిరప


వర్షానికి తడిసిన పంట

కౌటాల: మండలంలో మంగళవారం సాయంత్రం గాలివాన భీబత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. మామిడి కాయలు నేల రాలాయి. కౌటాల –కాగజ్‌నగర్ ప్రధాన రహదారి ముత్తంపేట వద్ద రోడ్డుపై ఉన్న గుంతల్లో వరద నీరు నిలిచింది. అకాల వర్షాల కారణంగా మిర్చి, మొక్కజొన్న పంటలు తడిసిపోయాయి. భారీ వర్షం కారణంగా విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

పరీక్షకు ఆటోల్లో ప్రయాణం


పరీక్షకు ఆటోలో వచ్చిన విద్యార్థులు

కౌటాల: మండలంలోని కన్నెపల్లి, పార్డీ, సాండ్‌గాం, వీరవెల్లి, నాగేపల్లి, కనికి గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల్లోని పదో తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరీక్షకు సకాలంలో చేరుకోవాలని విద్యార్థులు ఆటోల్లో పరీక్ష కేంద్రాలకు హాజరవుతున్నారు. కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాల్లో మంగళవారం పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. విద్యార్థులను ఉపాధ్యాయులు పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపించారు. జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 146 మంది విద్యార్థులకు గాను 146 మంది హాజరైనట్లు ఎంఈవో సోమయ్య తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 220 మంది విద్యార్థులకు గాను 220 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. దూర ప్రాంతాల్లోని విద్యార్థులను కుటుంబ సభ్యులు బైక్‌లపై తీసుకొచ్చారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేని విద్యార్థులు ఆటోల్లో పరీక్ష కేంద్రాలకు హాజరయ్యారు. ఆలస్యం కావడంతో పలువురు విద్యార్థులు పరుగులు తీశారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పశువులకు టీకాలు వేయించాలి


టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి శ్రీకాంత్

కౌటాల: పశుపోషకులు పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. కౌటాల పశువైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వీరవెల్లి గ్రామంలో ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా పశువులకు టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ పశువులకు టీకాలు వేస్తే ఆరోగ్యంగా ఉంటాయన్నారు. 4 నెలల వయస్సు పైబడిన పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. రైతులు పశుసంపదను పెంచాలని, పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ ఉంచాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నెల రోజుల పాటు టీకాల కార్యక్రమం కొనసాగుతుందని, రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది సందీప్, ప్రకాశ్, రాజన్న, బిక్షపతి, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం


బెజ్జూర్: అవగాహన కల్పిస్తున్న సీడీపీవో


గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీవో

బెజ్జూర్: పోషకాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని సోమిని, మూగవెల్లి, ఇప్పలగూడ, తాళాయి అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణకు సంబంధించిన పలు అంశాలను పిల్లల తల్లులకు వివరించారు. సూపర్‌వైజర్ కరుణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, కిశోర బాలికలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని బొర్లకుంట, రాళ్లగూడ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో సురేఖ కార్యక్రమానికి హాజరయ్యారు. గర్భిణులకు సీమంతం చేయడంతో పాటు చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, పండ్లు తీసుకోవడం ద్వారా గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనసూర్య, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయకుమారి, సవిత, ఆయాలు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

రజాకార్ సినిమా తిలకించిన ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని వెంకటరమణ థియేటర్‌లో రజాకార్ సినిమాను మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌లు తిలకించారు. వీరితో పాటు నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


సినిమా తిలకిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాసుల పంట కురిసేనా!

- త్వరలో కౌటాల వార సంతకు వేలం
- ఏటా గ్రామపంచాయతీకి రూ.లక్షల్లో ఆదాయం
- కనీస సౌకర్యాలు కరువు


కౌటాల వారసంతలో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

కౌటాల: మండలకేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే వారసంతకు త్వరలో వేలం నిర్వహించనున్నారు. మండల కేంద్రంలోని పశువుల, వార సంతతో ఏటా గ్రామ పంచాయతీకి రూ. లక్షల్లో అదనపు ఆదాయం వస్తుంది. ఏటా వార సంతతో సుమారు రూ.7 లక్షల వరకు ఆదాయం వస్తుండగా, పశువుల సంతతో సుమారు రూ.12 లక్షలపైనే ఆదాయం వస్తోంది. పశువుల, వార సంతలకు వేలందారులు పోటాపోటీగా వేలంలో పాల్గొంటారు. ఈ ఏడాది వేలం ధర పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

అతిపెద్ద వారసంత..

పేద, మధ్యతరగతి కుటుంబాల అవసరాలకు వారానికోసారి సరిపడా సరుకులు, కూరగాయలు కొనుగోలు చేసేందుకు సంతలపై ఆధారపడుతుంటారు. పల్లెలు, మండల కేంద్రాల్లో నిర్వహించే సంతలకు చాలా ప్రాముఖ్యత ఉంది. కౌటాల మండల కేంద్రంలో ప్రతీ సోమవారం వారసంత నిర్వహిస్తారు. ఈ సంతలో ప్రజలకు కూరగాయలతో పాటు నిత్యావసర సరుకులు, బట్టలు, స్టీల్ వస్తువులు, ఎద్దుల అలంకరణ వస్తువులు దొరుకుతాయి. కౌటాల వారసంతకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే అతిపెద్ద వారసంతగా పేరుంది. వార సంతతో పాటు పశువుల వార సంతను సైతం సోమవారం నిర్వహిస్తారు. దీంతో కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి), కాగజ్‌నగర్ మండలాలతో పాటు మహారాష్ట్ర ప్రాంతం నుంచి వ్యాపారులు, వినియోగదారులు వేల సంఖ్యలో సంతకు వస్తుంటారు. అయితే వారసంత స్థలం కబ్జాకు గురవుతుండడంతో సంత జరిగే రోజు స్థలం సరిపోక వ్యాపారులు కౌటాల –బెజ్జూర్ ప్రధాన రహదారికి ఇరువైపులా విక్రయాలు జరుపుతున్నారు.


కౌటాలలో సంతరోజు ట్రాఫిక్ జామ్

సంతలో సౌకర్యాలేవి..

ఏటా కౌటాల గ్రామ పంచాయతీకి వార సంతతో రూ.15 లక్షల పైనే ఆదాయం వస్తున్నప్పటికీ గ్రామ పంచాయతీ అధికారులు వారసంతలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. వారసంత స్థలాన్ని కబ్జాదారులు రోజురోజుకూ అక్రమంగా కబ్జా చేస్తుండడంతో వారసంతలో వ్యాపారులకు స్థలం సరిపోవడం లేదు. దీంతో వ్యాపారులు కౌటాల –బెజ్జూర్ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా విక్రయాలు చేస్తున్నారు. దీంతో సంత రోజు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. కూరగాయల వారసంతలో సులభ్ కాంప్లెక్స్‌లు లేకపోవడంతో అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువుల సంత సైతం కనీస సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మూగజీవాలు సైతం ఎండలో ఎండుతూ, వానలో తడుస్తున్నాయి. వార సంతలో అన్ని సౌకర్యాలు కల్పించాలని వ్యాపారులు, వినియోగదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక సాయం అందజేత

వాంకిడి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని అర్లీ గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఆదె సంతోష్ కుటుంబానికి మండల భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. సంతోష్ కుటుంబాన్ని పరామర్శించి భార్య మౌనికకు రూ.10 వేలు, 50 కిలోల బియ్యం అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు నాగుల రవి, ఉపాధ్యక్షుడు రాములు, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండు, కార్యదర్శి నానాజీ, కోశాధికారి సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత

నార్నూర్: మగ్గం వర్క్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళవారం మండల కేంద్రంలోని ఇంద్ర క్రాంతి పథకం కార్యాలయంలో ఏపీఎం మైన రమేష్ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్ర క్రాంతి పథకం ద్వారా 43 మంది మహిళలకు మగ్గం వర్క్‌పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణను దిగ్విజయంగా పూర్తిచేసుకున్న మహిళలను అభినందించడంతో పాటు వారిని ప్రోత్సహించడానికి సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. ప్రస్తుత కాలంలో మగ్గం వర్క్ చాలా డిమాండ్ ఉందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు స్వయం ఉపాధి పొంది పొంది కాళ్లపై వాళ్లు నిలబడి కుటుంబానికి ఆసరా కావాలన్నారు.

టీబీజీకేఎస్‌కు రాజీనామా

రెబ్బెన: టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా మాజీ ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్ మంగళవారం టీబీజీకేఎస్‌కు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొంతమంది రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం సంఘాన్ని నిర్వీర్యం చేస్తూ, సంఘాన్ని తాకట్టు పెట్టి వేరొక పార్టీకి మద్దతు తెలుపుతున్నారని ఆరోపించారు. యూనియన్‌లో చేరిన కొంత మంది నాయకులు టీబీజీకేఎస్ సంఘాన్ని తమ స్వార్థం కోసం తాకట్టు పెట్టడంతో తట్టుకోలేక యూనియన్‌కు రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. రాజీనామా పత్రాన్ని యూనియన్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డికి పంపించినట్లు తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సంతోష్‌రెడ్డి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనందునా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఓటరు జాబితాలో సవరణను వేగవంతం చేయాలని ఆదేశించారు. కోడ్‌ను ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పెద్ద మొత్తంలో నగదు తరలించరాదని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయరాదన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మహేష్, ఎంఆర్ఐ నాగోరావు, సీనియర్ అసిస్టెంట్ మీరాబాయి, ఎంసీ శంకర్ పాల్గొన్నారు.